క్లుప్తంగా

బీచ్ పార్కులోకి సందర్శకులకు అనుమతి



ఆధునికీకరించిన బీచ్ పార్కు

భీమునిపట్నం: భీమిలి బీచ్ పార్కులోకి సందర్శకులకు అధికారులు ప్రవేశం కల్పించారు. గత కొద్ది నెలల క్రితం రూ. 20 లక్షలతో పార్కు ఆధునికీకరణ పనులు ప్రారంభించారు. అందులో భాగంగా మొక్కలు, గడ్డి వేశారు. అప్పుడే సందర్శకులను అనుమతిస్తే అవి పాడైపోతాయని ఇంత వరకు ఎవరినీ అనుమతించలేదు. కాగా ఇప్పుడు అవి బాగా పెరగడంతో పార్కులోకి సందర్శకులను అనుమతించారు. ఇప్పుడు పార్కు సుందరంగా మారడంతో అంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఇనాం భూముల సాగుదారులకు పట్టాలు



సర్వే వివరాలను రైతులకు వివరిస్తున్న తహశీల్దార్ హేమంత్ కుమార్

ఆనందపురం : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇనాం భూముల సాగుదారులకు పట్టాలివ్వడానికి ఏర్పాట్లు చేస్తున్నామని తహసీల్దార్ హేమంత్ కుమార్ చెప్పారు. మండలంలోని బోని, శిర్లపాలెం గ్రామాల్లో ఆయా గ్రామాల రైతులతో ఏర్పాటు చేసిన గ్రామ సభల్లో ఆయన మాట్లాడారు.

141 మందికి వైద్య పరీక్షలు



హిమోగ్లోబిన్ పరీక్ష నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పద్మనాభం : పద్మనాభం గ్రామంలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా 141 మందికి బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. జ్వరం, సాధారణ వ్యాధులతో బాధపడుతున్న వారికి, గర్భవతులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి స్వప్న రోగులను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ప్రకాష్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా శివాలయం వార్షికోత్సవం

పీఎం పాలెం: జీవీఎంసీ 8వ వార్డు సప్తగిరి కాలనీలోని శివాలయం 17వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహా దేవునికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేశారు. ఉత్సవాలలో భాగంగా భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పి.కాశీరావు, స్థానికులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు బ్యాగుల పంపిణీ

తగరపువలస : నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం భీమిలి మండలం చిప్పాడ జెడ్పీ హైస్కూల్లో 31 మంది బాలికలకు బ్యాగులు పంపిణీ చేశారు. వీటిలో స్టేషనరీ ఉంచి అందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎస్.విజయకుమార్, ఉపాధ్యాయులు రేఖ అప్పారావు, హేమసుందర్, నాంది ప్రతినిధులు లక్ష్మి, అహల్య, రాజేశ్వరి పాల్గొన్నారు.

పల్స్‌పోలియోకు ఏర్పాటు

పద్మనాభం : మండలంలో ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియోకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి స్వప్న తెలిపారు. 3229 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. ఇందు కోసం 43 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పద్మనాభం జంక్షన్, ఏనుగులపాలెంలో ట్రాన్సిట్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, 70 మంది సిబ్బందిని నియమించినట్టు తెలిపారు.

మూడు నెలల్లో ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణం

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- రూ.2 కోట్ల దివీస్ సీఎస్‌ఆర్ నిధులతో పనులకు శ్రీకారం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస : భీమిలి నియోజకవర్గంలో మూడు దశాబ్దాలకు పైగా రాజ్యమేలుతున్న సమస్యల పరిష్కారం ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమయిందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శనివారం జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బంగ్లామెట్ట వద్ద నాలుగు ఎకరాల్లో రూ.2 కోట్ల దివీస్ లేబొరేటరీ సీఎస్‌ఆర్ నిధులతో నిర్మించనున్న ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణానికి ఆయన శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో ప్రధాన కేంద్రమైన తగరపువలసలో ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మించవలసిన ఆవశ్యకత ఎంతయినా ఉందన్నారు. మూడు నెలల్లోనే దీనిని పూర్తి చేయడానికి ప్రయతిస్తామన్నారు. గత ప్రభుత్వాలు ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణంలో విఫలం అయ్యాయన్నారు. దివీస్ యాజమాన్యం కాంప్లెక్స్ నిర్మాణానికి చొరవ చూపడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి భీమిలి అభివృద్ధికి ప్రోత్సాహం అందిస్తున్నారన్నారు. పాండ్రంగి వద్ద గోస్తనీ నదిపై వంతెన, భీమిలి నరసింహస్వామి కొండ, అనంత పద్మనాభ కొండపై ఘాట్ రోడ్డు, బీచ్‌రోడ్డు సెంట్రల్ లైటింగ్, చిట్టివలస జ్యూట్‌మిల్లు సమస్య, చిల్లపేట పెద్ద చెరువు సమస్యలకు పరిష్కారం చూపారన్నారు. ప్రజలంతా ఇవన్నీ గమనించాలన్నారు. మాటలు చెప్పేదెవరో, చేతల్లో చూపేదెవరో తెలుసుకోవాలన్నారు. ఆర్టీసీ నుంచి డీపీటీవో ఎ.అప్పలరాజు, డిప్యూటీ సీటీఎంలు బి.అప్పలనాయుడు, జి.సత్యనారాయణ, ఈఈ కె. వెంకటరాజు, డిప్యూటీ ఈఈ పీవీ నరసింహారావు, మద్దిలపాలెం, వాల్తేరు డిపో మేనేజర్లు అరుణకుమారి, కె.సుధాకర్ తదితరులు మాట్లాడుతూ ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మిస్తున్న ప్రదేశంలో ఉన్న డ్రైనేజీని తరలించి ఆటంకం లేకుండా చూడాలన్నారు. దివీస్ తరఫున డి.సురేష్‌కుమార్, వరహాలరెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణానికి అవసరమైతే ఇంకా ఎక్కువ ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో భీమిలి జెడ్పీ కనకమహాలక్ష్మి, జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, కార్పొరేటర్ దొలపల్లి ఏడుకొండలు, కో ఆప్షన్ సభ్యురాలు కొప్పల ప్రభావతి, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, కోరాడ వెంకటరావు, అక్కరమాని రామునాయుడు, శిల్లా కరుణాకరరెడ్డి, జగుపల్లి ప్రసాద్, చిల్ల భాస్కరరెడ్డి, జీరు వెంకటరెడ్డి, అల్లిపల్లి నరసింగరావు, ఉప్పాడ నాగేశ్వరరావు, జీవీ రమణ, కొప్పల రమేష్, సరగడ రఘునాథరెడ్డి, వాసుపల్లి కొండబాబు, జీవీ నారాయణ, జీరు సుజాత, అక్కరమాని చినబాబు, చిల్ల ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

కుమ్మర్లకు 50 ఏళ్లకే పెన్షన్ ఇవ్వాలి



శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పురుషోత్తమ్‌ను సన్మానిస్తున్న నాయకులు

తగరపువలస : కుమ్మరి వృత్తి చేసుకునే శాలివాహన సామాజిక వర్గ ప్రజలకు ప్రభుత్వం ఏభై ఏళ్లకే పెన్షన్ ఇచ్చేలా సహకరించాలని జిల్లా శాలివాహన సంఘం ప్రతినిధులు రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తమ్‌ను కోరారు. శనివారం చిట్టివలస వచ్చిన ఆయనను జిల్లా ప్రతినిధులు కలిసి ఈ మేరకు వినతిపత్రాలు అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రతినిధులు మాట్లాడుతూ చదువుకున్న శాలివాహన సామాజిక వర్గానికి చెందిన యువతకు దివీస్‌లో ఉద్యోగాలు, చేయూత పథకం ద్వారా ఏటా రూ.10 వేల సాయం, మట్టి కోసం బంజరు స్థలాలు కేటాయించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. దీనికి స్పందించిన చైర్మన్ పురుషోత్తం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. జిల్లా శాలివాహన (కుమ్మరి) సంఘం అధ్యక్షుడు అరటికోట్ల వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్ దేవవరపు అర్జున వెంకటరావు, జిల్లా సంఘం సభ్యుడు దేవవరపు చిరంజీవిరావు, కార్యదర్శి కొత్తూరు త్రినాథ భాస్కరరావు, కోశాధికారి తాటిపూడి శ్రీనివాసరావు, తాటిపూడి కృష్ణారావు, పొట్నూరు అప్పలరాజు, శ్రీకాకుళపు జగదీశ్వరరావు, పెనుగుర్తి వెంకట సన్యాసిరావు, కొప్పాక రామకృష్ణ, పొట్నూరు పోలిరాజు, అరటికోట్ల రాంబాబు, తాటిపూడి నర్సిబాబు, కొప్పాక నారాయణరావు, జామి శ్రీను, ఊశెట్టి రమణ, బుడుమూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంసీబీ సీజన్-5 విజేత ఎస్‌ఎన్‌డీ చంద్రంపాలెం



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు

మధురవాడ : క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి, ఆత్మ స్థైర్యం పెరగడానికి ఎంతగానో దోహద పడతాయని పలువురు వక్తలు తెలిపారు. బొట్టవానిపాలెం శివారులో గత 15 రోజులుగా హోరాహోరీగా నిర్వహించిన ఎంసీబీ సీజన్-5 క్రికెట్ పోటీలు శనివారం ముగిసాయి. ఈ పోటీలకు మధురవాడ పరిసర ప్రాంతాలకు చెందిన 24 జట్లు హాజరయ్యాయి. ఇందులో విజేతగా ఎస్ఎన్‌డీ చంద్రంపాలెం నిలువగా, ద్వితీయ, తృతీయ స్థానాల్లో బొట్టవానిపాలెం, వాంబే కింగ్స్ క్రికెట్ జట్లు నిలిచాయి. యువత చెడు వ్యసనాలకు దూరంగా, సామాజిక స్పృహ కలిగి ఉండాలని వక్తలు పిలుపునిచ్చారు. విజేతలకు వివిధ పార్టీలకు చెందిన నాయకులు, నిర్వాహకులు, నాయకులు ఎన్. సత్యనారాయణ, కొర్రాయి సురేష్, జగ్గుపిల్లి నరేష్ తదితరులు బహుమతులు, ట్రోఫీలు అందజేశారు.

వయోశ్రీ యోజన పథకంతో వృద్ధులకు ఆసరా



వయోశ్రీ యోజన పథకం గుర్తింపు శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

తగరపువలస : వృద్ధులకు అవసరమైన కళ్లజోళ్లు, వినికిడి యంత్రాలు, ఊతకర్రలు, వీల్ చైర్లు, మెడ- నడుము- మోకాలి నొప్పులకు మెడికల్ బెల్టులు అందించే ఆసరాయే వయోశ్రీ యోజన పథకమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శనివారం చిట్టివలస జ్యూట్‌మిల్లు కల్యాణ మండపంలో ఉపకరణాల గుర్తింపు శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన ఈ పథకం కోట్లాది మందికి ప్రయోజనం కలిగిస్తుందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి కూడా వృద్ధులకు వైఎస్సార్ పెన్షన్ కానుక ద్వారా నెలకు రూ.3 వేలు అందిస్తున్నారన్నారు. కో ఆర్డినేటర్ రూపాకుల రవికుమార్ మాట్లాడుతూ ఈ నెల 4న ఇలాంటి శిబిరం భీమిలి గంటస్తంభం వద్ద నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ వయోవృద్ధుల దివ్యాంగుల సంక్షేమశాఖ అధికారి జె.మాధవి, జెడ్పీ కనకమహాలక్ష్మి, ఏపీడీ సంతోష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, వార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్, శిల్లా కరుణాకరరెడ్డి, బీజేపీ నాయకులు కంటుబోతు రామానాయుడు, రెడ్డిపల్లి శ్రీనివాసరావు, తాతపూడి ప్రదీప్‌కుమార్, మహంతి అప్పల రమణ, గుజ్జు రాము, ఆలిం కో ప్రతినిధులు సోమనాథ్ జై, చంద్రసోనాలి, సీతం తదితరులు పాల్గొన్నారు.

తీరానికి కొట్టుకొచ్చిన డాల్ఫిన్ మృతదేహం



సాగర్‌నగర్ బీచ్‌కు కొట్టుకొచ్చిన డాల్ఫిన్ మృతదేహం

కొమ్మాది: పర్యాటక ప్రాంతమైన సాగర్‌నగర్ తీరానికి శనివారం మధ్యాహ్నం డాల్ఫిన్ మృతదేహం ఒకటి కొట్టుకొచ్చింది. సముద్ర జలాల్లో కాలుష్యం ఎక్కువైనప్పుడు లేక సముద్రంలో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా అత్యధిక స్థాయిలో ఉన్నప్పుడు సముద్ర జీవులు మృత్యువాత పడుతుంటాయని ఇక్కడి మత్స్యకారులు తెలిపారు. గతంలో కూడా రుషికొండ, సీతకొండ, తొట్లకొండ బీచ్‌ల వద్దకు డాల్ఫిన్ల మృతదేహాలు కొట్టుకొచ్చాయి. ఇలా డాల్ఫిన్ మృత్యువాత పడటం కలిచి వేందని పర్యాటక ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మహిళలు ఆరోగ్యంపై మరింత శ్రద్ధ చూపాలి



మాట్లాడుతున్న డీన్ చందు సుబ్బారావు

మధురవాడ : మహిళలు ఆరోగ్యంపై మరింత శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని గాయత్రి విద్యా పరిషత్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డీన్ చందు సుబ్బారావు అన్నారు. ఈ నెల 8న మహిళలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. శనివారం మధురవాడ గాయత్రి మెడికల్ కళాశాలలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళల్లో బ్రెస్ట్ క్యాన్సర్, ఎముకల గుల్లబారడం, ఊబకాయం ఎక్కువగా కనిపిస్తున్నాయన్నారు. వారిలో బ్రెస్ట్ క్యాన్సర్ కనుక్కోవడానికి మెమోగ్రఫీ టెస్ట్, షుగర్ కనుగొనే హెచ్‌బీఏ1సీ టెస్ట్, బోన్ మినరల్ డెన్సిటీ టెస్ట్, మార్చి 4న ఊబకాయం కనుగొనే ఫైబ్రో స్కాన్ ఉచితంగా చేస్తామనిచెప్పారు. అవసరం అయితే ఉచిత వైద్య శిబిరానికి వచ్చే రోగులకు భోజన ఏర్పాట్లుకూడా చేస్తామని చెప్పారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



బక్కన్నపాలెం సాయిప్రియ రోడ్డులో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న శివ తదితరులు

మధురవాడ : ఎండల వేడి ప్రారంభం కానుండడంతో వాహనచోదకులు, పాదచారులు, కార్మికులు, విద్యార్థుల దాహార్తి తీర్చేందుకు మాతృశ్రీ చారిటబుల్ ట్రస్ట్ అండ్ బిల్డర్స్ ఆధ్వర్యంలో కీ.శే. పోతిన అప్పారావు, సన్యాసమ్మ జ్ఞాపకార్థం శనివారం మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు. మాతృశ్రీ అధినేత, వైఎస్సార్‌సీపీ నాయకుడు పోతిన శివ మాట్లాడుతూ గత 5 ఏళ్లుగా మాతృశ్రీ, శ్రీరామ బుద్ధ వెల్ఫేర్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో వేసవిలో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కొమరపు శ్రీనివాస్, సంతోష్, పిళ్లా రేవతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలని వినతి



ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు సంగివలసలో శశి విద్యాసంస్థల యాజమాన్యం దౌర్జన్యంగా పైపులైన్ నిర్మించి మురుగును గోస్తనీ గెడ్డలో కలుపుతుందని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యే ముత్తంశెట్టికి వినతిపత్రం అందించారు. అలాగే వలందపేట సర్వే నంబర్ 26/2లో నకిలీ డాక్యుమెంట్లతో కొనుగోలు చేసిన స్థలంలో ప్రహరీ నిలిపివేయాలని కూడా కోరారు. ఈ రెండింటిపైన స్పందనలో ఫిర్యాదు చేశామని అయినప్పటికీ పూర్తి చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే విచారించి చర్యలు తీసుకోవాలని సూచిస్తూ భీమిలి తహసీల్దార్‌కు బదలాయించారు. వినతిపత్రం అందించిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కరమాని రామునాయుడు, కొప్పల ప్రభావతి, శిల్లా కరుణాకరరెడ్డి, జీరు వెంకటరెడ్డి, చిల్ల సూర్యనారాయణరెడ్డి, జీవీ రమణ, ఉప్పాడ నాగేశ్వరరావు, నీలాపు రామిరెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల్లో మనమే బెస్ట్



జగనన్న కాలనీ రిజిస్ట్రేషన్ పత్రాలు లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ఆనందపురం : సీఎం జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు దేశం మొత్తం మీద కొనియాడబడుతున్నాయని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెప్పారు. ఆనందపురంలో రూ.1.74 కోట్లతో చేపట్టిన జల్‌జీవన్ మిషన్ పథకాల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు, చందకలో రూ.63 లక్షలతో చేపట్టిన మంచినీటి పథకాలకు శంకుస్థాపన చేశారు. జగనన్న కాలనీ లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస సౌకర్యాలు కరువై గ్రామీణ ప్రాంత వాసుల ఇబ్బందులను కళ్లారా చూసిన సీఎం జగన్ సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఆనందపురం పంచాయతీలో ఐదేళ్లలో రూ.107 కోట్లతో వివిధ పథకాలు అమలు జరిపామని గత టీడీపీ పాలనలో పేదలకు ఏమైనా మేలు జరిగిందా అని ప్రశ్నించారు. ఆనందపురం, వేములవలస, గొట్టిపల్లితో పాటు పలు గ్రామాల్లో ఉన్న కాలనీ ఇళ్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. రానున్న కాలంలో యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడానికి కార్యాచరణ రూపొందిస్తున్నామని, భీమిలి నుంచి తనను గెలిపించి మరలా జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంను చేసుకోవడానికి అందరూ కంకణం కట్టుకోవాలన్నారు. తహశీల్దారు హేమంత్ కుమార్, ఎంపీడీవో ఎస్.అప్పలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, మండల పార్టీ అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, సర్పంచ్‌లు చందక లక్ష్మి, బంక శ్రీను, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బంటుబిల్లి మణిశంకర నాయుడు, వైస్ ఎంపీపీ పాండ్రింకి శ్రీను, సహకార సంఘం అధ్యక్షుడు పాండ్రింకి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అదనపు దర్శనం టిక్కెట్ల జారీకి వినతి

తగరపువలస : తిరుమలకు వచ్చే భక్తులకు ప్రత్యేక ప్రవేశ దర్శనం అదనపు కోటా టిక్కెట్లు జారీ చేయాలని నగరానికి చెందిన సామాజిక కార్యకర్త జి.అప్పన్న కోరారు. శనివారం టీటీడీ ఆధ్వర్యంలో జరిగిన డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో ఆయన పలు సమస్యలు విన్నవించారు. కొండపైకి చేరుకునే వాహనాలను పటిష్టంగా తనిఖీ చేయడం ద్వారా పాలిథిన్ తదితర నిషేధిత వస్తువులకు అడ్డుకట్ట వేయాలని కోరారు. వీటిపై ఈవో ఏవీ ధర్మారెడ్డి బదులిస్తూ ఆలయ పవిత్రత, భద్రతను కాపాడేందుకు విజిలెన్స్ విభాగాన్ని పటిష్టం చేస్తామన్నారు.

గోల్డ్‌మెడల్ విన్నర్ కోటిరెడ్డికి సత్కారం



కోటిరెడ్డిని సత్కరిస్తున్న బాడీ బిల్డింగ్ అసోషియేషన్ ప్రతినిధులు

తగరపువలస: గత నెల 23 నుంచి 25 వరకు చెన్నైలోని జెప్పియార్ విశ్వవిద్యాలయం, తమిళనాడు అమెచ్యూర్ బాడీ బిల్డింగ్ అసోషియేషన్ సంయుక్తంగా నిర్వహించిన 14వ జూనియర్ మిస్టర్ ఇండియా నేషనల్ ఛాంపియన్ షిప్-2024 విన్నర్ బోర కోటిరెడ్డిని శనివారం ఆయన శిష్యులు ఘనంగా సత్కరించారు. శ్రీ ఆంజనేయం మజిల్ ప్లానెట్ జిమ్ నుంచి మెయిన్‌రోడ్డులో తీన్‌మార్, బాణసంచాతో ఊరేగింపుగా తీసుకెళ్లి సత్కరించారు. అక్కరమాని లోవరాజు, విజ్జపు సంతోష్‌కుమార్, అమ్మిరెడ్డి, వెంపాడ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరెంటు కోతలతో ఇక్కట్లు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డులో పలు చోట్ల మూడు రోజుల నుండి అనధికారిక కరెంటు కోతలతో స్థానికులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. తిమ్మాపురం, రామాద్రికాలనీ, మంగమారిపేట, కాపుల దిబ్బడపాలెం ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం తేడా లేకుండా గంట గంటకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

విద్యార్థులకు వివిధ పోటీలు

తగరపువలస : వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా శనివారం భీమిలి మండలం చిప్పాడ జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు దివీస్ యాజమాన్యం బహుమతులు అందించింది. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎస్.విజయకుమార్, ఉపాధ్యాయులు రేఖ అప్పారావు, డీవీ సత్యవతి, దివీస్ ప్రతినిధి కె.నరసింహ, వలంటీర్లు అహల్య, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



మొగిదబంద కబ్జా నిజమే

- క్షేత్రస్థాయి పరిశీలనలో నిర్ధారించిన అధికారులు



మొగిద బంద ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మండల సర్వేయర్ రాజేష్, వీఆర్వో నాయుడు

ఆనందపురం : మండలంలోని కుసులువాడలో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి మొగిదబందను ఆక్రమించడం నిజమేనని క్షేత్రస్థాయి పరిశీలనలో రెవెన్యూ అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు ఆక్రమణదారుడిపై చర్యలకు ఉపక్రమిస్తున్నారు. శనివారం సాక్షి దినపత్రికలో 'దర్జాగా మొగిదబంద కబ్జా' శీర్షికన వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు తహశీల్దారు హేమంత్ కుమార్ ఆదేశాల మేరకు మండల సర్వేయర్ రాజేష్, వీఆర్వో నాయుడు శనివారం బంద ప్రాంతాన్ని పరిశీలించారు. సర్వే నంబరు 106లో విస్తరించి ఉన్న మొగిద బందను రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆక్రమించి ప్లాట్లు వేయడంతో పాటు, దర్జాగా రోడ్డు నిర్మిస్తున్నట్టు గుర్తించారు. అలాగే వేరే సర్వే నంబర్లకు సంబంధించి కోర్టులో భూ వివాదం ఉండగా వాటికి కోర్టు ఇచ్చిన స్టేటస్-కో ఆర్డర్‌ను అడ్డం పెట్టుకుని దానికి సంబంధించిన హెచ్చరిక బోర్డుని మొగిదబంద ప్రాంతంలో పెట్టి అధికారులను తప్పుతోవ పట్టించినట్టు గుర్తించారు. ఈ మేరకు మొగిద బంద సరిహద్దులను సర్వేయర్ నిర్ధారించారు. ఈ సందర్భంగా తహశీల్దారు హేమంత్ కుమార్ మాట్లాడుతూ మొగిద బంద ఆక్రమణకు గురైనట్టు విచారణలో బయటపడిందన్నారు. ఆక్రమించిన వారిపై ప్రభుత్వ భూమి ఆక్రమణ చట్టం కింద కేసు నమోదు చేస్తామన్నారు. బంద హద్దులు నిర్ధారించి ప్రాంతాన్ని స్వాధీనం చేసుకుని భూ రక్షణ చర్యలు చేపడతామని వెల్లడించారు.

ఆస్పత్రికి వెళ్లి పెన్షన్ అందజేత



అప్పలనారాయణకు పెన్షన్ అందిస్తున్న వలంటీర్ పైడిరాజు

తగరపువలస : భీమిలి మండలం మజ్జివలస పంచాయతీకి చెందిన వృద్ధుడు చిల్ల అప్పలనారాయణ అస్వస్థత కారణంగా సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతనికి మజ్జివలస సచివాలయ వలంటీర్ గుడ్డాల పైడిరాజు శనివారం ఆస్పత్రికి వెళ్లి పెన్షన్ అందించారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు



ఇళ్ల పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

కొమ్మాది : అర్హులైన పేదలందరికీ ఈ ప్రభుత్వం ఇంటి స్థలాలు అందిస్తుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఎనిమిదవ వార్డు పరిధిలో శనివారం సాయంత్రం అర్హులైన 975 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇల్లులేని పేదలందరికీ స్థలాలు ఇవ్వాలన్న గొప్ప సంకల్పంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారని అన్నారు. ఇంత అద్భుతంగా పాలన అందిస్తోంటే ప్రతి పక్షాలు అర్థంలేని ఆరోపణలు చేస్తున్నాయని, వారెన్ని ప్రయత్నాలు చేసినా మళ్లీ వైఎస్సార్‌సీపీయే అధికారంలోకి వస్తుందన్నారు. అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

రేపు సుద్దాల అశోక్ తేజ రాక

భీమిలిలోని కళాసాహితీ ఆధ్వర్యంలో 4వ తేదీ సోమవారం జరగబోయే కార్యక్రమంలో ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ పాల్గొంటున్నారని శనివారం నిర్వాహకులు తెలిపారు. చిన్నబజారు ప్రాంతంలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్లో సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు జరిగే ఇష్టాగోష్ఠిలో అందరితో మాట్లాడతారని తెలిపారు.